సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం। 19। డిసెంబర్। 2023



తొమ్మిది మందికి కారుణ్య నియామక పత్రాలు


వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబీకులకు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లా కారుణ్య నియామకం కింద తొమ్మిది మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. 8లో

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు



స్థానిక ప్రాచీన శ్రీ గోలింగేశ్వరస్వామి వారి ఆలయంలో కొలువై ఉన్న శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 8లో

డెల్టా కాలువలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం డెల్టా కాలువలకు 8,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,100, మధ్య డెల్టాకు 400, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

క్షేత్ర స్థాయిలో సమగ్ర భూ రీ సర్వే

ప్రాసెసింగ్ సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్ శుక్లా



భూ రీసర్వే డేటా ప్రాసెసింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

ముమ్మిడివరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు–భూ రీసర్వేకు సంబంధించిన పూర్తి డేటాను నిక్షిప్త పరిచేందుకు జిల్లా ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా భూసర్వే–భూమి రికార్డుల శాఖ ఏర్పాటు చేసిన జిల్లా డేటా ప్రాసెసింగ్ సెంటర్‌ను సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం నిర్వహణకు ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది ఉన్నారని, భూ రీసర్వేకు సంబంధించి అన్ని వివరాలు ఇక్కడ లభిస్తాయన్నారు. ప్రాసెసింగ్ సెంటర్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్లను పరిశీలించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్‌డీఓ జి.కేశవ వర్ధన రెడ్డి, భూరికార్డుల అసిస్టెంట్ డైరెక్టర్ కె.ప్రభాకర్, రాష్ట్ర సర్వే ఉద్యోగస్తుల ఆర్గనైజింగ్ సెక్రటరీ దాసరి సాయిబాబు, శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాణిక్యాంబా అమ్మవారికి బంగారు చీర



ఈవోకు రూ.లక్ష అందజేస్తున్న మంత్రి వేణు మనవరాలు సునిధి

రామచంద్రపురం రూరల్: అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి ఆలయంలో అమ్మవారికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బంగారు చీర చేయించాలని సంకల్పించారు. దీనిలో భాగంగా సోమవారం మంత్రి వేణు అమ్మవారి సన్నిధిలో తన మనవరాలు సునిధి చేతుల మీదుగా ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావుకు రూ. లక్ష అందించి బంగారు చీర తయారు చేయించే పనులు ప్రారంభించాలని కోరారు. మంత్రి వేణు వెంట రామచంద్రపురం వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ), మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శీలం రమణ ఉన్నారు.

ఇంటర్ అర్ధ సంవత్సర పరీక్షలు మొదలు



అమలాపురంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో సత్యనారాయణరెడ్డి

అమలాపురం టౌన్: జిల్లాలో జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు అర్ధ సంవత్సర పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. ఈ నెల 23వ తేదీ వరకూ ఈ పరీక్షలు జరుగుతాయి. జిల్లాలోని 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఒక ఎయిడెడ్ కళాశాల, 64 అన్ ఎయిడెడ్, 44 ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో రెండు సంవత్సరాలకు సంబంధించి మొత్తం 26 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ అధికారి (డీఐఈవో) ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో పరీక్షల నిర్వహిస్తున్నారు. అమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరుగుతున్న తెలుగు పరీక్షలను డీఐఈవో సత్యనారాయణరెడ్డి సోమ వారం పరిశీలించారు. ఏర్పాట్లపై ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు సూచనలు చేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, ద్వితీయ సంవత్సరం వారికి మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ పరీక్షలు జరుగుతున్నాయి.

వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా చందు

మధురపూడి(రాజమహేంద్రవరం సిటీ): వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కోరుకొండకు చెందిన బొండాడ చందు నియమితులయ్యారు. కొన్నేళ్లుగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఆయనకు పార్టీ ఈ బాధ్యతలు అప్పగించింది. చందు పార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్రను పోషిస్తున్నారు.

ఆటోమేటిక్‌గా మహిళా ఉన్నతి

- పదిమంది ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఆటో రుణాలు
- ఎస్సీ, ఎస్టీలకు అవకాశం
- తొమ్మిది మండలాల నుంచి పదిమంది ఎంపిక
- రూ.31.16 లక్షల రుణం... సున్నా వడ్డీ రాయితీ

సాక్షి అమలాపురం/ అమలాపురం రూరల్: మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పథకంలోనూ వారికి నేరుగా లబ్ధి చేకూర్చటమే కాదు... వారి ఆర్థిక ఉన్నతికి దోహదపడే చర్యలు చేపటింది. వ్యవసాయ ఆధారిత జిల్లా కోనసీమలో కొబ్బరి, ఇతర ఉద్యాన పంటల విలువ ఆధారిత పరిశ్రమలను మహిళలతో ఏర్పాటు చేయిస్తున్న ప్రభుత్వం వారికి ఇతర రంగాలలో కూడా అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మహిళా స్వయం శక్తి సంఘాలు (ఎస్‌హెచ్‌జీ)లలో ఎస్సీ, ఎస్టీలకు ఆటోలు ఇచ్చేందుకు 'మహిళా శక్తి ఆటో' పథకానికి శ్రీకారం చుట్టింది. తొలి విడతగా తొమ్మిది మండలాలకు చెందిన పది మంది లబ్ధిదారులకు ఆటోలు అందజేసింది.

వారంపాటు శిక్షణ

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పరిధిలో సెర్ప్ ఉన్నతిలో ఎంపిక చేసిన పది మంది మహిళలకు ఆటోలు అందించింది. ఉన్నతి పథకంలో మహిళా శక్తి ఆటో పథకంలో ఒక్క లబ్ధిదారునికి రూ.2,98,929 నుంచి రూ.3,35,190 వరకు రుణంగా మంజూరు చేసింది. మొత్తం పది మంది మహిళలకు రూ.31.16 లక్షల వరకు రుణం అందించి వీటిని సమకూర్చింది. గతంలో ఉన్నతిలో కేవలం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు మాత్రమే రుణం అందేది. కాని ఈసారి రుణం ఏకంగా రూ.3.35 లక్షల వరకు ఇస్తుండడం



మహిళా శక్తి ఆటో పథకంలో పొందిన వాహనాలతో లబ్ధిదారులు

గమనార్హం. ఆటోలలో బజాజ్, అప్పీ కంపెనీలకు చెందిన డీజిల్, సీఎన్‌జీ వాహనాలు ఉన్నాయి. అర్హులైన లబ్ధిదారు మహిళలకు సెర్ప్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు విజయవాడలో శిక్షణ అందించారు. తీసుకున్న రుణంపై సకాలంలో వడ్డీ చెల్లిస్తే సున్నా వడ్డీ రాయితీ పొందనున్నారు. మొత్తం రుణాన్ని 48 వాయిదాలలో చెల్లించాల్సి ఉంది.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

మహిళా సాధికారితకు ప్రభుత్వం కృషి చేస్తోందని, దీనిలో భాగంగా వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రుణాలపై ఆటోలు అందించామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. కలెక్టరేట్ వద్ద లబ్ధిదారులైన మహిళలకు సోమవారం ఆటోలు అందజేశారు. కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ ఎస్ఎస్‌జీ సభ్యులకు వీటిని అందజేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌లో ఉన్నతి పథకం ద్వారా పది మందికి వీటిని రాయితీతో అందిస్తున్నామన్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్‌ప్రసాద్, ఏపీడీ ఎం.ఎం.జిలానీ, ఫైనాన్స్ డీపీఎం విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పదిమందికి లబ్ధి

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపులో సభ్యులుగా ఉన్న అమలాపురం అంబేడ్కర్ సంఘంలో సభ్యురాలు జల్లి దమయంతి, అల్లవరం జ్యోతి గ్రూప్‌నకు చెందిన నాగవరపు వరలక్ష్మి, పి.గన్నవరం శాంతి గ్రూపునకు చెందిన కె.సత్యవతి, రామచంద్రపురం ఝాన్సీ గ్రూపునకు చెందిన ఎస్.ప్రశాంతి, మామిడికుదురు అక్షరా గ్రూపునకు చెందిన కె.సునీతారావు, ఆత్రేయపురం భాగ్యలక్ష్మి గ్రూపునకు చెందిన వరలక్ష్మి, కపిలేశ్వరపురం దేవదీవెన గ్రూపునకు చెందిన బి.పావనీ, కపిలేశ్వరపురం శ్రీ మల్లేశ్వరి గ్రూపునకు చెందిన ఆర్.సూర్యక్రాంతి, అయినవిల్లి బాబా గ్రూపునకు చెందిన టి.ప్రశాంతి, రావులపాలెం థామస్ గ్రూపునకు చెందిన వి.విజయ్‌కుమారి ఆటోలు పొందారు.



లబ్ధిదారులకు ఆటోలు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తదితరులు

సున్నా వడ్డీ రాయితీ



ఎస్ఎహెచ్‌జీ మహిళలు ఉన్నతిలో తీసుకున్న రుణంపై వాయిదాలను సకాలంలో చెల్లిస్తే వారిపై వడ్డీ భారం ఉండదు. జిల్లాలో మహిళలు ఆర్థిక ఉన్నతికి వారు చేసే ఎన్నో రకాల వ్యాపారాలపై ఎస్‌హెచ్‌జీలకు ఇచ్చే రుణాలతోపాటు స్త్రీ నిధి ద్వారా రుణాలు అందిస్తున్నాం. వివిధ రకాల ప్రభుత్వరంగ సంస్థల నుంచి రుణాలు ఇప్పిస్తున్నాం. ఈ కార్యక్రమాలు జిల్లాలో విజయవంతంగా సాగుతున్నాయి.

– డాక్టర్.వి.శివశంకర్, ప్రాజెక్టు మేనేజర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

ప్రైవేట్ అప్పు అయితే రూ.1.50 లక్షల వడ్డీ



మండపేట నియోజకవర్గం పరిధిలోని కపిలేశ్వరపురం **మండలంలో దేవ**దీవెన ఎస్ఎస్‌హెచ్‌జీకి చెందిన **బిక్కి పావని ఉన్న**తి మహిళా శక్తి ఆటోలో బజాజ్ **మాగ్జిమ డీజిల్** ఆటోను పొందింది. ఇందుకు రూ.3,03,434 ఆమె రుణంగా పొందింది. గతంలో ఆమెకు ఉన్నతిలో రూ.50 వేల వరకు రుణం వచ్చేది. 'రుణం మీద సున్నా వడ్డీ రాయితీ ఉండడం మాకు చాలా మేలు జరిగింది. ఇదే ప్రైవేట్ ఫైనాన్స్ వద్ద అప్పు అయితే వాయిదాల వల్ల రూ.1.50 లక్షల వరకు వడ్డీ పడి ఉండేది. ప్రభుత్వం సున్న వడ్డీ వల్ల మాకు వడ్డీ భారం తప్పింది' అని పావని తెలిపింది.

ఇంత పెద్ద రుణం ఊహించలేదు



మామిడికుదురు అక్షర ఎస్‌హెచ్‌జీకి చెందిన కుసుమ సునీతరావు సైతం గతంలో ఉన్నతిలో రుణం పొందినా పెద్దగా వ్యాపారం చేసుకోలేదు. కాని ఈసారి ఏకంగా రూ.2,98,929 వరకు రుణం వచ్చింది. దీంతో బజాజ్ మాగ్జిమ సీఎన్‌జీ ఆటో పొందింది. 'ఉన్నతితో ఇంత పెద్ద రుణం వస్తుందని అనుకోలేదు. గతంలో నా భర్త అద్దెకు ఆటో తీసుకుని నడుపుకునేవాడు. ఇప్పుడు సొంతంగా ఆటో వచ్చింది. ప్రభుత్వం చేసిన మేలు మరువలేం' అని సునీతరావు తెలిపారు.

పరిష్కారాలు చూపాలి

అమలాపురం రూరల్: ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే అర్జీదారుల సమస్యల పట్ల క్రియాత్మకంగా స్పందించి సత్వరమే తగు పరిష్కార మార్గాలు సంతృప్తికర స్థాయిలో చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు 154 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా అర్జీల పరిష్కార సరళిని మెరుగు పరచాలని సూచించారు. గడువు దాటిన అర్జీలు లేకుండా నిర్దేశిత కాలవ్యవధిలో పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. ప్రతి జిల్లా స్థాయి అధికారి తమ లాగిన్‌కు వచ్చిన అర్జీలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్నారు. అర్జీదారుని సంతృప్తి ధ్యేయంగా పనిచేస్తూ, జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై అర్జీదారులలో విశ్వసనీయతను పెంపొందించాలన్నారు. ఒకసారి సమర్పించిన అర్జీ మళ్లీ అదే అంశంపై రాకుండా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, జగనన్నకు చెబుదాం పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ 'జగనన్నకు చెబుదాం'కు 15 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ ఖాదర్ బాషా

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 15 అర్జీలు వచ్చాయి. జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల నుంచి బాధితులు వచ్చి ఫిర్యాదులు అందజేశారు. వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువ ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలకు సంబంధించినవే ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయం స్పెషల్ బ్రాంచ్ సీఐ రాజశేఖర్, జగనన్నకు చెబుదాం కార్యక్రమ ఎస్సై రమణ పాల్గొన్నారు.

'శివ'మెత్తిన ప్రతిభ



శివ గంగాదుర్గకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న ఎంపీడీఓ అనుపమ అధికారులు

- పారా ఒలింపిక్స్‌లో డిస్కస్, జావెలెన్ త్రోలో బంగారు పతకాలు
- ఇంజరం సచివాలయ కార్యదర్శిగా శివ గంగాదుర్గ సేవలు
- తాళ్లరేవులో హారతులిచ్చి స్వాగతం పలికిన అధికారులు

తాళ్లరేవు: ఇంజరం సచివాలయ కార్యదర్శిగా సేవలందిస్తున్న గాలిదేవర శివ గంగాదుర్గ థాయిలాండ్‌లో జరిగిన పారా ఒలింపిక్స్ క్రీడల్లో సత్తాచాటింది. డిస్కస్ త్రో, జెవెలెన్ త్రోలలో రెండు బంగారు పతకాలను కైవసం చేసుకుంది. షార్ట్‌పుట్‌లో నాలుగవ స్థానంలో నిలిచింది. పతకాలు అందుకుని తాళ్లరేవు వచ్చిన శివ గంగాదుర్గకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ ఎం.అనుపమ, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవ మూర్తి, కార్యాలయ ఏఓ చింతా మోహనకృష్ణ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హారతులిచ్చి స్వాగతం పలికారు. దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు. ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి గ్రామానికి చెందిన శివ గంగాదుర్గ 2019లో ఇంజరం సచివాలయం–2లో గ్రేడ్–5 కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి సేవలందిస్తున్నారు.

ఆటలపై మక్కువతోనే పారా ఒలింపిక్స్‌కు...

శివ గంగాదుర్గకు చిన్నతనం నుంచి ఆటలంటే ఎంతో మక్కువ. ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు స్థానికంగా ఉన్న కాన్వెంట్‌లో చదివి, తరువాత టెన్త్ వరకు హైస్కూల్‌లో చదివారు. ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సమయంలో పక్షవాతం వచ్చి ఎడమ చేయి పనిచేయకుండా పోయింది. అయినప్పటికీ మొక్కవోని దీక్షతో చదివి ఇంటర్ పూర్తిచేసింది. సుంకరపాలెం రవి కళాశాలలో బీఎస్సీ డిగ్రీ పూర్తిచేసిన అనంతరం ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఎస్సీ స్పేస్ ఫిజిక్స్ చేసేందుకు చేరింది. ఆ సమయంలో పారా ఒలిపిక్స్ గురించి తెలుసుకుని, ఎలాగైనా పారా ఒలింపిక్స్‌లో పాల్గొనాలని కంకణం కట్టుకుంది. పీజీ పూర్తికాకుండానే సచివాలయ కార్యదర్శిగా ఉద్యోగం రావడంతో కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో చదువు మానేసి ఉద్యోగంలో చేరింది. యానాంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా ప్రాంగణంలో పారా స్పోర్ట్స్ కోసం ప్రత్యేక తర్ఫీదు తీసుకుంది. 2021లో బిహార్‌లో జరిగిన జాతీయ స్థాయి పారా స్పోర్ట్స్‌లో డిస్కస్ త్రోలో బంగారు పతకం సాధించింది. 2022, 23లలో జరిగిన జాతీయస్థాయి పోటీలలో కూడా ప్రతిభ కనబరచడంతో ఇటీవల థాయిలాండ్‌లో జరిగిన పారా ఒలింపిక్స్‌కు ఎంపికైంది. భారతదేశం నుంచి సుమారు 70 మంది పాల్గొనగా, ఆంధ్రప్రదేశ్‌నుంచి ముగ్గురు మాత్రమే పాల్గొన్నారు. వీరిలో శివ గంగాదుర్గ డిస్కస్ త్రో, జావెలెన్ త్రోలలో ఎఫ్–35 విభాగంలో బంగారు పతకాలు సాధించింది. మరో క్రీడ షాట్‌పుట్‌లో నాలుగవ స్థానంలో నిలిచింది.



థాయిలాండ్‌లో జరిగిన పారా ఒలింపిక్స్‌లో రెండు బంగారు పతకాలు సాధించిన సచివాలయ కార్యదర్శి శివ గంగాదుర్గ

రూ.2 లక్షల బ్యాంకు రుణం తీసుకుని...

పారా ఒలింపిక్స్‌లో పాల్గొనాలంటే రూ.2లక్షలకు పైగా ఖర్చవుతుందని అధికారులు చెప్పారు. శివ గంగాదుర్గ ప్రతిభను గుర్తించిన రిలయన్స్ సంస్థ రూ.50 వేల సహాయం ప్రకటించింది. దీంతో మరో రూ.2 లక్షలు బ్యాంకు రుణం తీసుకుని పోటీ లకు హాజరైనట్లు శివ గంగాదుర్గ విలేకర్లకు తెలిపింది. ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ, సహచర ఉద్యోగుల సహకారంతో ఈ ఘనత సాధించగలిగానని తెలి పింది. తన తండ్రి వెంకట్రామయ్య తాను 6వ తరగతి చదివే సమయంలో మృతి చెందారని, అప్పటి నుంచి తల్లి లక్ష్మి టైలరింగ్ చేస్తూ తమ కుటుంబాన్ని పోషించి తనను ఈ స్థాయికి తీసుకువచ్చినట్లు చెప్పింది. తనకు స్పాన్సర్స్ ఉంటే మరిన్ని పతకాలు సాధిస్తానని శివ గంగాదుర్గ తెలిపింది.

వైద్యరంగంలో సువర్ణ అధ్యాయం

ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపుపై కలెక్టర్

అమలాపురం రూరల్: పేదల సంజీవనిగా వెలుగొందుతున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథక పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ వైద్యరంగంలో సువర్ణ అధ్యాయానికి రాష్ట్ర ప్రభుత్వం నాంది పలికిందని కలెక్టర్ హి మాన్షు శుక్లా పేర్కొన్నారు. సోమవారం సీఎం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి 26 జిల్లాల కలెక్టర్లు ఆరోగ్య సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నూతనంగా రూపొందించిన ఫీచర్స్‌తో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, 2024 జనవరి ఒకటో తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమాల గురించి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గతంలో రూ.ఐదు లక్షలు ఉండే ఈ పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో రూ.25 లక్షల వరకు పెంచిందని, క్యాన్సర్ చికిత్సకు పరిమితి లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి పేద కుటుంబం ఒక ఏడాది కాలంలో రూ.25 లక్షల వరకు వైద్య సేవలు పొందవచ్చునన్నారు. వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన సంస్కరణలను ప్రవేశపెట్టిందని, ప్రతి ఇంటికి ఆరోగ్య సేవలు అందేలా ప్రణాళికను రూపొందించి అమలు చేస్తోందన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఏఎన్ఎంలు, సిబ్బందితో రెండు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటికి వెళ్లి కొత్త ఫీచర్స్‌తో ఉన్న స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను అందజేయాలన్నారు. ఆరోగ్యశ్రీ యాప్, దిశ యాప్‌ను మహిళా పోలీసుల ద్వారా డౌన్లోడ్ చేయించాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలి అన్న అంశంపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఏడాదికి రూ.ఐదు లక్షల లోపు వార్షిక ఆదాయం పొందే అందరూ ఈ ఆరోగ్య శ్రీ పరిధిలోకి వస్తారన్నారు. ఆరోగ్యశ్రీ రోగాల సంఖ్యను 3,257 వరకు పెంచారని, అనెట్‌వర్క్ ఆసుపత్రుల సంఖ్య 2,513 వరకు రాష్ట్ర ప్రభుత్వం విస్తరించిందన్నారు. జగనన్న ఆరోగ్యశ్రీ రెండో దశ కార్యక్రమంలో జనవరి ఒకటి నుంచి ప్రతి గ్రామంలో ఆరు నెలలకు ఒకసారి హెల్త్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. ఒక మండలంలో సగం గ్రామాలలో మంగళవారం, మరో సగం గ్రామాలలో శుక్రవారం ఈ క్యాంపులు జరుగుతాయని చెప్పారు. పేదలు వైద్యం కోసం అప్పుల పాలు కారాదనే సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను తీసుకుని వచ్చిందని అన్నారు. కొత్త ఫీచర్స్‌తో రూపొందించిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను వారు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎస్పీ ఎస్.శ్రీధర్, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకేరావు, హితకారిణి సమాజం చైర్మన్ కాశీ బాల మునికుమారి, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్‌ఖాదర్, పురపాలక సంఘం చైర్‌పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, డీసీ హెచ్ఎస్ పద్మశ్రీ రాణి డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావు దొర, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ఆంబ్రోస్, మేనేజర్ నవీన్, టీం లీడర్ వి.రవి పాల్గొన్నారు.



స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్సీ కుడుపూడి, ఎమ్మెల్యే చిట్టిబాబు

అంగన్‌వాడీ సెంటర్లకు హంగులు

- రెండో దశ నాడు – నేడులో మౌలిక సదుపాయాలు
- రూపురేఖల మార్పుతో కొత్త అందాలు
- 698 అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధికి చర్యలు

కొత్తపేట: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల పాత భవనాల రూపు రేఖలు మారనున్నాయి. పిల్లలకు ప్రీ ప్రైమరీ పాఠశాలలైన అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించారు. మనబడి నాడు – నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మాదిరిగా అంగన్‌వాడీ సెంటర్లకు ఉన్న పాత స్వంత భవనాలను ఆధునీకరించనున్నారు. జిల్లాలో 1,726 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా వాటిలో 701 సెంటర్లకు స్వంత భవనాలు ఉన్నాయి. వాటిలో మరమ్మతుల దశలో 698 భవనాలు ఉన్నాయి. ఆ భవనాలను నాడు – నేడు ఫేజ్–2బీ ద్వారా అభివృద్ధి చేయనున్నారు. అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు రంగులు వేసి ముస్తాబు చేస్తారు. అంగన్‌వాడీ సెంటర్ భవనాలకు మరమ్మతులు, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్, వాటర్, కుళాయి కనెక్షన్, పెయింటింగ్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఆయా అంగన్‌వాడీ సెంటర్‌లలో గుర్తించిన పనులను బట్టి రూ. 1.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ మంజూరు చేస్తారు. ఉదాహరణకు అంగన్‌వాడీ కేంద్రానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తే ఆ మొత్తంలో రూ.4 లక్షలు మెటీరియల్, రూ.లక్ష కూలీలకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ పనులకు ప్రభుత్వం మార్గదర్శకాలు నిర్దేశించింది. ఈ ఆధునీకరణ పనులకు సంబంధించి ప్రణాళిక తయారు చేయడానికి ఐసీడీఎస్ ప్రాజెక్టుల స్థాయిలో ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సులు నిర్వహించారు.



కొత్తపేట మండలం వాడపాలెం అంగన్‌వాడీ సెంటర్

మదర్స్ కమిటీల ద్వారా పనులు

ఈ అంగన్‌వాడీ సెంటర్ల నాడు – నేడు పనులను మదర్స్ కమిటీల ద్వారా చేపట్టనున్నారు. ప్రతీ అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల తల్లిదండ్రుల కమిటీ ఏర్పాటు చేసుకోవాలి. కమిటీలో అంగన్‌వాడీ కార్యకర్త కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. సూపర్‌వైజర్, హెచ్‌ఎం, అంగన్‌వాడీ సెంటర్‌లో 2 నుంచి 5 ఏళ్లలో పేర్లు నమోదు చేసుకున్న ముగ్గురు తల్లులతో పాటు ఇంజినీరింగ్ అసిస్టెంట్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ద్వారానే పనులు చేస్తారు. కమిటీ పేరుతో బ్యాంకుల్లో జాయింట్ ఖాతాలు ప్రారంభించాలి. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ నాడు–నేడు పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేసేలా పర్యవేక్షణ బాధ్యతలు ప్రభుత్వం కమిటీలకు అప్పగించింది.

ప్రతిపాదనలు సిద్ధం చేశాం

జిల్లాలో 698 అంగన్‌వాడీ సెంటర్ల ఆధునీకరణకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. నాడు – నేడు ఫేజ్ 2బీ కింద సెంటర్లలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు భవనాలను సుందరంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకున్నాం. అంగన్‌వాడీ మదర్స్ కమిటీ ఆధ్వర్యంలో పనులు చేపడతాం.

– జీవీ సత్యవేణి, ఐసీడీఎస్ పీడీ, అమలాపురం

పనులను బట్టి నిధుల కేటాయింపు

నాడు – నేడు ఫేజ్ 2బీలో 89 అంగన్‌వాడీ సెంటర్లను ఆధునీకరించాలని గుర్తించాం. ఆయా సెంటర్లలో చేపట్టే పనులను బట్టి నిధులు కేటాయిస్తారు. మదర్స్ కమిటీ సభ్యులతో నిధులు ఖర్చు చేయిస్తాం. వారి పేరుతో జాయింట్ ఖాతాలు ఓపెన్ చేయాల్సి వుంది.

– పీ శారద, సీడీపీఓ, కొత్తపేట

క్లుప్తంగా

ఇంటర్ కాలేజీ అథ్లెటిక్స్‌లో ఐడియల్ ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు(కాకినాడ): జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజియేట్ అథ్లెటిక్ పోటీలో ఐడియల్ ఇంజినీరింగ్ మెకానికల్ విభాగ తృతీయ సంవత్సర విద్యార్థి కె.వెంకట జగదీష్ ప్రతిభ చూపాడు. 100 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానం, 200 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానంతో పాటు ఫాస్టెస్ట్ మెన్ ఆఫ్ ది యూనివర్సిటీగా నిలిచాడు. నరసారావుపేటలో నిర్వహించిన సబ్ జూనియర్, జూనియర్ మీటర్ అక్వాటిక్ సౌత్‌జోన్ స్విమ్మింగ్ పోటీల్లో 1500 మీటర్ల కాంపిటేషన్‌లో సీఎస్ఈ ప్రథమ సంవత్సర విద్యార్థి పి.సాయిధనుష్‌రాజ్ ద్వితీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు, కరస్పాండెంట్ చిరంజీవిని కుమారి, ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్ హెచ్‌ఓడీలు అంజిబాబు, ఎంఎస్ ఆర్ఎస్ ప్రసాద్ సోమవారం కళాశాలలో అభినందించారు.

20న జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. హెచ్‌వన్ హెచ్‌ఆర్ సంస్థలో 500 పోస్టులు, డి మార్ట్ 50, ఫ్లిప్‌కార్ట్‌లో 70 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పదవ తరగతి, ఐటీఐ, డిగ్రీ విద్యార్హతలు గలవారు హాజరుకావచ్చునన్నారు. ఎంపికైన వారికి వేతనం రూ.14వేల నుంచి రూ. 32వేల వరకూ ఉంటుందన్నారు. వివరాలకు 0884-2373270 నంబరులో సంప్రదించాలి.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు

- బిక్కవోలుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే దంపతులు

బిక్కవోలు : స్థానిక ప్రాచీన శ్రీ గోలింగేశ్వరస్వామి వారి ఆలయంలో కొలువై ఉన్న శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ జంగావీర వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలు తెల్లవారు జామున 1.20 గంటలకు తీర్థపు బిందె సేవతో ప్రారంభమయ్యాయి. స్వామికి నిత్య పూజల అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. భారీ సంఖ్యలో భక్తులు క్యూ లో బారులు తీరారు. గోదావరి కాలువలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకోవడం ఇక్కడ ఆచారం, దీంతో స్నానఘట్టాలన్నీ జనంతో నిండిపోయాయి. సంతానం లేని వారికి సంతానాన్ని ప్రసాదించే ఈ స్వామి ఆలయంలోని పుట్టపై ఉంచిన నాగుల చీరను ధరించి ఆలయం వెనుక నిదురిస్తే స్వామివారు కలలో సాక్షాత్కరించి సంతానాన్ని ప్రసాదిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో సంతానం లేని వారు అధిక సంఖ్యలో ఆలయం వెనుక నాగులు చీర ధరించి నిదురించారు. రాత్రి తొమ్మిది గంటలకు స్వామి వారికి నెమలి వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, బ్యాండ్ మేళాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు తాగునీరు, చిన్నారులకు పాలు, మజ్జిగ, బిస్కెట్లు, పులిహోర పంపిణీ చేశారు. షిర్డీ సాయి సేవాసమితి ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు బాణసంచా కాల్పులు తిలకించడానికి ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. అనంతరం బ్యాండ్ మేళాలు, కోయ డ్యాన్సులు, గరగ నృత్యాలు, గారడీలతో రాత్రి 11గంటలకు స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 12గంటల నుంచి తెల్లవారు జాము వరకు బాణసంచా కాల్పుల పోటీలు సాగాయి. ఈ పోటీలను తిలకించడానికి జిల్లా వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. షష్ఠి సందర్భంగా స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు, జిల్లా మహిళ స్థాయి సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, బిక్కవోలు ఉపసర్పంచ్ డాక్టర్ మురళీకృష్ణారెడ్డి ఉన్నారు.



తెల్లవారుజామున స్వామివారికి తీర్థపు బిందె తీసుకువెళుతున్న అర్చకుడు



కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



సంతానం కోసం నాగుల చీర ధరించి ఆలయ ప్రాంగణంలో నిదురించిన మహిళలు



బిక్కవోలులో స్వామి దర్శనం కోసం క్యూ లో ఉన్న భక్తులు

ఏకబిగిన 151 పాటల ఆలాపన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక విక్రమహాల్‌లో ఆదివారం జరిగిన ప్రత్యేక సినీ సంగీత విభావరి అలరించింది. ఉదయం 10 నుంచి రాత్రి 10:30 వరకు విరామం లేకుండా 29 మంది ఫిమేల్ సింగర్స్‌తో బర్రె సుబ్రహ్మణ్యం 151 పాటలు పాడి ప్రేక్షకుల్ని ఆనందింపచేశారు. గత ఏడాది డిసెంబర్ 18న 12 గంటలపాటు ప్రోగ్రాం చేసి 117 పాటలు పాడి సుబ్రహ్మణ్యం రికార్డు నమోదు చేశారు. ఇప్పుడు అదే 12 గంటల్లో 151 పాటలు పాడినందుకు సంగీత ఐక్యవేదిక పెద్దలు, సీనియర్ గాయకులు రాయుడు చంద్రకుమార్, పి.శ్రీహరి, ఏ.సుభాష్, ఎం.సత్యనారాయణ చౌదరి, సీతారామారావు, ఆదిమూలం సాయిబాబా, డి సుబ్రహ్మణ్యం, మణిధర్, సత్యనారాయణ, బ్రహ్మం, శ్రీరామ్, ఘంటసాల రాజు, రాజేశ్వరరావు, ఆదర్శ, డి.ఈ ప్రసాద్ అభినందించారు. ఇన్ని పాటలు ఇంతవరకు మెయిల్ సింగర్ ఎవరూ పాడలేదని చెబుతూ బర్రె సుబ్రహ్మణ్యంను పూలమాలతో సత్కరించారు. ఈసందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తనతో గొంతు కలిపి పాడిన ఫిమేల్ సింగర్స్ కృతజ్ఞతలు తెలిపారు. దీపికా ఈవెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రాం నిర్వహించారు.



సినీ సంగీత విభావరిలో గీతాలు ఆలపిస్తున్న సుబ్రహ్మణ్యం

తొమ్మిది మందికి కారుణ్య నియామక పత్రాలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబీకులకు సోమవారం జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం -స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లా కారుణ్య నియామకం కింద తొమ్మిది మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. వీరిలో ఒక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులోని బాధిత కుటుంబ సభ్యునికి ఉద్యోగ నియామక పత్రం అందించినట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. తొమ్మిది మందిలో ఐదుగురిని జూనియర్ సహాయకులుగా, నలుగురిని ఆఫీస్ సబార్డినేట్‌లుగా నియమిస్తూ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వారీగా ఖాళీల సంఖ్య రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చామని కలెక్టర్ కృతికాశుక్లా వివరించారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా అభ్యర్థులు సూచించారు. జేసీ ఇలక్కియ, ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీరమణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి జీఎస్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

యానాం జిప్‌మెర్ వైద్య సేవలు ప్రారంభం

యానాం: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు నిర్మించిన జిప్‌మెర్ మల్టీ స్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్ ఆసుపత్రిలో అవుట్ పేషెంట్ సేవలను సోమవారం ప్రారంభించారు. తొలిరోజు జిప్‌మెర్ వైద్య బృందం, సిబ్బంది, సెక్యూరిటీ గార్డుల ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో జ్యోతి వెలిగించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులకు స్వాగతం పలికారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ ప్రజలు ఆసుపత్రిలో అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం మెడిసిన్, ఎముకలు, ప్రసూతి, గైనకాలజీ విభాగాల సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో జిప్‌మెర్ వైద్యులు నోడల్ ఆఫీసర్ డాక్టర్ దిలీప్‌మౌర్య, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆనంద్‌రాజ్, డాక్టర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

బైక్ దొంగల అరెస్టు



నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లు

రూ.4 లక్షల విలువైన 8 బైక్‌లు స్వాధీనం

పాలకొల్లు సెంట్రల్: ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి ఎనిమిది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ దారావత్తు రాంబాబు చెప్పారు. సోమవారం విలేకరులకు సీఐ కేసు వివరాలను వెల్లడించారు. సోమవారం ఉదయం నరసాపురం రోడ్డు అయ్యప్పస్వామి టెంపుల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నరసాపురం నుంచి పాలకొల్లు వైపు ఓ ద్విచక్ర వాహనంపై హెల్మెట్ లేకుండా ముగ్గురు వ్యక్తులు వెళుతున్నట్లు పోలీసులు గమనించారు. వారిని ఆపే ప్రయత్నం చేయగా, వెనక్కి తిరిగి వెళ్లిపోయారు. వెంటనే ఎస్సై, సిబ్బందితో కలిసి వారిని వెంబడించి పట్టుకున్నారు. వీరిని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బెండమూరులంకకు చెందిన వై.కృష్ణబాబు, అల్లవరం మండలం గుండేపూడి గ్రామానికి చెందిన కె.ఓం సాయితేజ, రాజోలు మండలం పొదలాడకు చెందిన జి వెంకటరత్నంలుగా గుర్తించారు. వీరిని విచారణ చేయగా ఈనెల 11వ తేదీన పాలకొల్లు మండలం పూలపల్లిలోని ఓ ఇంట్లో రాత్రి 1 గంట సమయంలో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. అదే విధంగా గత నాలుగు నెలలుగా పశ్చిగోదావరి జిల్లా, కోనసీమ జిల్లా, వైజాగ్ జిల్లాల పరిసర ప్రాంతాల్లో మోటర్ సైకిళ్లు దొంగతనం చేసినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి బుల్లెట్‌లు-2, గ్లామర్-1, హోండా ప్యాషన్-2, స్ప్లెండర్-1, షైనీ-1, పల్సర్-1 మొత్తం రూ.4 లక్షలు విలువైన ఎనిమిది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎస్సై ఎస్.ముత్యాలరావు, వీఆర్వో జోగారావు, కానిస్టేబుళ్లు సుబ్రహ్మణ్యం, చింతన్న, వై.మణి పాల్గొన్నారు.

డీఎల్ఎస్ఏలో మైనార్టీ హక్కుల దినోత్సవం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో మైనారిటీ హక్కుల దినోత్సవం సోమవారం జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రత్యూష కుమారి మాట్లాడుతూ వివిధ సంస్కృతులు, సంప్రదాయాలకు నెలవైన భారతదేశంలో తక్కువ సంఖ్యలో ఉన్న తరగతుల వారిని మైనారిటీలుగా పరిగణిస్తారన్నారు. జాతీయ మైనారిటీల కమిషన్ చట్టం 1992లోని వివిధ అంశాలపై అవగాహన కలిగివుండాలన్నారు. ఈ చట్టం ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు (జొరాస్ట్రియన్), జైన మతాలకు వర్తిస్తుందన్నారు. భారత రాజ్యాంగంలోని 29, 30 అధికరణలు మతపరమైన, సాంస్కృతిక, భాషాపరమైన మైనారిటీల హక్కులను పరిరక్షిస్తాయన్నారు. వారి వారసత్వం, సంస్కృతిని సంరక్షించడానికి ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ విద్యను అందించేందుకు వీలు కల్పిస్తాయన్నారు. మతం, భాష, సంస్కృతుల ఆధారంగా మైనారిటీల పట్ల వివక్ష చూపించడం తగదని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మైనారిటీలకు, సామాన్య ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. జాతీయ మైనారిటీల కమిషన్ చట్టం 1992, రాజ్యాంగంలోని సంబంధిత అధికరణలపై అవగాహన కల్పించారు. సదస్సులో కాకినాడ జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి బి.నారాయణ, ఏపీ స్టేట్ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ కాకినాడ ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్, రెవెన్యూ, మైనారిటీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

పోలింగ్ స్టేషన్ల తనిఖీ

కోటనందూరు: మండలంలోని పోలింగ్ స్టేషన్లను సోమవారం అధికారులు పరిశీలించారు. కేపీ మల్లవరం, కేఓ అగ్రహారం, పాతకొట్టాం, కొత్తకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారి, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో మంచినీరు, మరుగుదొడ్డి, విద్యుత్, దివ్యాంగులు చేరుకునేందుకు ప్లాట్‌ఫాం, ఆహ్లాదకర వాతావరణం తదితర సౌకర్యాలు ఉన్నాయా? లేదా? అని పరిశీలించి వివరాలు నమోదు చేశారు. పంచాయతీ కార్యదర్శులు కుశిరెడ్డి అప్పలరాజు, రాజా నాగేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పాతకొట్టాం జెడ్పీ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అరుణ్‌కుమార్

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్-ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో సోమవారం విస్తృతంగా దాడులు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. మండలంలోని శరభవరంలో ఐదు లీటర్ల సారాతో నల్లం శ్రీను, ఒమ్మంగిలో పది లీటర్ల సారాతో కొట్టేటి అప్పలరాజు అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి స్థానిక తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ ఎదుట హాజరు పరిచారు. ఈ దాడుల్లో కాకినాడ జిల్లా ఇంటిలిజెన్స్ వింగ్ సీఐ కె.గిరిధర్, ప్రత్తిపాడు సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

25 నుంచి కెనాల్ రోడ్డుకు మరమ్మతులు

అనపర్తి: ఈ నెల 25 నుంచి వేమగిరి-సామర్లకోట కెనాల్ రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కెనాల్ రోడ్డు అభివృద్ధి జరగకపోవడానికి గత టీడీపీ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కెనాల్ రోడ్డు అభివృద్ధికి రూ.220 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులు మంజూరయ్యాయన్నారు. అయితే పనులు ప్రారంభించే సమయానికి అధికారంలోకి వచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం రోడ్డు అభివృద్ధికి టెండర్ దక్కించుకున్న సంస్థతో కుమ్మక్కై మొబలైజేషన్ అడ్వాన్స్ కింద పెద్ద మొత్తంలో నిధులు దోచుకున్నారని విమర్శించారు. అప్పుడు టీడీపీ ప్రభుత్వ నేతలు చేసిన పాపం ఇప్పుడు ప్రయాణికులకు శాపంగా మారిందన్నారు. కెనాల్ రోడ్డు గోతులమయంగా మారడంతో గతంలో రెండు పర్యాయాలు ప్రభుత్వ నిధులతో, ఒకసారి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి తన సొంత సొమ్ముతో మరమ్మతులు చేయించారన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే మరోసారి తన సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టేందుకు ముందుకొచ్చారని చెప్పారు.



వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి

కేబుల్ వైరు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

ఉండ్రాజవరం: గ్రామంలో జియో కంపెనీ ఎలక్ట్రికల్ మెటీరియల్స్ స్టోర్స్ రూమ్‌లో కేబుల్ వైర్లు దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై కె.రామారావు తెలిపారు. ఉండ్రాజవరం గ్రామానికి చెందిన చాలా మహేష్ గత సెప్టెంబర్ నెలలో 130 మీటర్ల కేబుల్ వైర్లను దొంగిలించడంతో కేసు నమోదు చేశారు. నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి సుమారు రూ.15 వేల విలువ గల జియో కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై రామారావు తెలిపారు. ముద్దాయిని అరెస్ట్ చేసిన ఎస్సై కె.రామారావు, సిబ్బంది ఎస్.నాగేశ్వరరావు, బుజ్జి, ముత్యాలరావు, రాజు, త్రినాథ్‌లను కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ అభినందించారు.

23న యోగా పోటీలు

రాయవరం: విశ్వ మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న యోగాసనాల పోటీలను రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని మానవతా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. యోగాసనాలతో పాటుగా 108 సూర్య నమస్కారాలు, భగవద్గీత శ్లోకాల పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలల, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మానవతా సంస్థ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నామని, జిల్లా స్థాయి పోటీల్లో విజేతలకు బహుమతులతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 996667311 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2023 గ్రాండ్ ఫినాలే



వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో మంగళవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2023 గ్రాండ్ ఫినాలే కార్యక్రమం జరగనున్నట్టు ఆదిత్య కళాశాలల వైస్ చైర్మన్ ఎన్.సతీషరెడ్డి తెలిపారు. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, ఏఐసీటీఈ ఈ ఈవెంట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ గ్రాండ్ ఫినాలేలో 27 జట్లు పాల్గొంటున్నాయని, ఒక్కొక్కటి 5 సమస్య ప్రకటనలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. సృజనాత్మక పరిష్కారాలను కనుగొనడానికి, వారి నైపుణ్యాలను ఉపయోగించుకొనేలా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మంగళవారం ఉదయం 8 నుంచి 36 గంటల పాటు నిర్విరామంగా కార్యక్రమం సాగుతుందన్నారు. గ్రాండ్ ఫినాలేకు దేశంలో ప్రతిష్టాకరమైన 47 నోడల్ కేంద్రాలలో ఒకటిగా ఆదిత్య కళాశాలలకు స్థానం దక్కడం గర్వంగా ఉందన్నారు.

శివసదన్ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం



ఈఓ శ్రీనివాసమూర్తికి రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న దాత శ్రీలేఖ

తొండంగి: అన్నవరం సత్యగిరి కొండపై శివసదన్ నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన దాత ఎస్.శ్రీలేఖ రూ.10 లక్షల విరాళం సమర్పించినట్టు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి సోమవారం తెలిపారు. శివసదన్‌లో 328 సూట్ నిర్మాణం కోసం ఎన్.శంకరరావు, సీతామహలక్ష్మి పేరున ఈ విరాళం ఇచ్చినట్టు వివరించారు.

గోదావరిలో మునిగి వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండల పరిధిలోని పేరవరం గ్రామానికి చెందిన గద్దే నాగరాజు (54) గోదావరిలో ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. నాగరాజు ప్రతి రోజు గోదావరి నది దాటి లంకలోకి పశువులను తోలుకు వెళుతూ ఉంటాడు. ఆదివారం పశువులను తోలుకుని వెళుతూ గోదావరిలో ప్రమాదవశాత్తూ మునిగి మృతిచెందాడు. సోమవారం పేరవరం సమీపంలో గోదావరి వద్ద మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి అల్లుడు గారపాటి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మురుగు కాలువలో పడి మహిళ మృతి

తాళ్లపూడి: మండలంలోని గజ్జరం అన్నదేవరపేట గ్రామాల మధ్యలో ఉన్న మురుగునీటి కాలువలో గుర్తు తెలియని ఒక మహిళ మృతదేహం సోమవారం వెలుగు చూసింది. కాలువలో మృతదేహం తేలుతున్నట్టు తాళ్లపూడి పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్సై కె.వెంకట రమణ ఘటనా ప్రదేశానికి చేరుకుని విచారణ చేపట్టారు. అన్నదేవరపేటకు చెందిన పోసిన ప్రసన్న (32) మృతదేహంగా గుర్తించారు. భర్త విజ్జు సత్యనారాయణను వదిలేసి మతి స్థిమితం లేకుండా ఉంది. గ్రామానికి చెందిన ఆమె బంధువులు పోసిన ఉమా మహేశ్వరరావు, ప్రక్కిలంకకు చెందిన బంధువు దగ్గర ఉంటోంది. మతి స్థిమితం లేకుండా తిరుగుతూ ఆదివారం సాయంత్రం కాలువలో పడిపోయిందని ఎస్సై తెలిపారు. బంధువులకు తెలిసి సమాచారం మేరకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ముమ్మిడివరం: మండలంలోని గాడిలంకలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం గోదావరి తీరం వెంబడి లంక గ్రామాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సీఐ ఎస్.కొండయ్య ఆధ్వర్యంలో ట్రైనీ డీఎస్పీ విష్ణుస్వరూప్ పర్యవేక్షణలో దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.34 వేల నగదు, రెండు మోటారు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కిర్లంపూడి: వ్యక్తి అదృశ్యంపై పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైనట్లు ఏఎస్సై రామకృష్ణ తెలిపారు. మండల పరిధి రామకృష్ణపురం గ్రామానికి చెందిన గొడె సతీష్ తన భార్యతో గొడవ పడి ఈ నెల 15న బయటకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో సతీష్ తండ్రి గొడే వీరన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై రామకృష్ణ తెలిపారు.